ఉద్యానవనంగా కంబాలచెరువు

- అత్యాధునిక హంగులతో ఆధునికీకరణ
- రూ.9 కోట్లతో నిర్మాణం
- సెప్టెంబర్‌లో ప్రారంభం



కంబాల చెరువు పార్కు బోర్డు

రాజమహేంద్రవరం సిటీ: పార్కులంటే అందరికీ ఆహ్లాదం, ఆరోగ్యం, ఉత్సాహం అందిస్తాయి. ఆ దిశగా నగరంలోని కంబాల చెరువును అత్యాధునిక వసతులతో నందనవనంగా మార్పు చేస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ మెచ్చేలా, రోజంతా ఆనందంగా గడిపేలా వారికి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు, నగర పాలక సంస్థ నిధులు రూ.4 కోట్లతో ఆధునిక వసతులతో అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది.

అన్ని సదుపాయాలతో..

రాజమహేంద్రవరం నగరంలో పురాతనమైన కంబాలచెరువును ఉద్యానవనంగా ఆధునీకరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 10 ఎకరాల 23 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ కంబాల చెరువులో 6 ఎకరాల 2 సెంట్లలో చెరువు ఉండగా మిగిలిన 3 ఎకరాల 3 సెంట్ల భూమిలో రూ.9 కోట్లతో భవిష్యత్ తరాలకు అవసరమైన సదుపాయాలతో ఆధునిక నిర్మాణాలు చేపట్టారు. అందుకు అనుగుణంగా పనులు చేస్తున్నారు. ఇది పూర్తయితే ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఆహ్లాదాన్ని పంచుతుంది.

చెరువులో చేపడుతున్న పనులివే...


కంబాలచెరువు నమూనా చిత్రం


సిద్ధమవుతున్న మ్యూజికల్ ఫౌంటైన్

త్వరలో ప్రారంభిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం,నగర పాలక సంస్థ సంయుక్తంగా రూ.9 కోట్ల వ్యయంతో కంబాల పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. సెప్టెంబరు ద్వితీయార్థంలో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తాం. భవిష్యత్‌లో పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వర్షాల కారణంగా నిర్మాణంలో జాప్యం జరిగింది.

– పాండురంగారావు, ఎస్‌ఈ, నగర పాలక సంస్థ

నూతనంగా మల్టిపుల్ ఎంట్రీ, ఆధునిక వసతులతో లైటింగ్ వ్యవస్థ, మ్యూజికల్ లేజర్ షో, ప్లే కోర్టులు, జాగింగ్, పాత్ వే, సిటింగ్ ఏరియా, గ్రీనరీ, మోరల్ స్టోరీ గార్డెన్, స్టేటస్ ప్రైడ్ జోన్, గ్యాలరీ, కిడ్స్ ప్లే ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్, రోప్ వే సైక్లింగ్, బండ్ చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. కంబాల చెరువు ప్రధాన మార్గాన్ని షాడే గర్ల్స్ హైస్కూల్ వద్ద నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ఇవికాక మరో మూడు మార్గాలను బయకు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యానవనాన్ని రూపొందిస్తున్నారు. ఈ పార్కును భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అన్ని హంగులు పూర్తి చేసుకుని త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుంది.

క్లుప్తంగా

నయనానందం.. రాధాకృష్ణుల ఊయల ఉత్సవం


ఊయల ఉత్సవాన్ని నిర్వహిస్తున్న పండితుడు

సీటీఆర్ఐ: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాధాకృష్ణుల ఊయల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊయల ఉత్సవాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్‌చే ఊయల లీలా విశిష్టతపై ఉపన్యాసం ఉంటుందని ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. 30న సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 31న బలరామ జయంతిని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు గోపూజ జరుగుతుందన్నారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం యథావిధిగా నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్, ఫేస్‌బుక్ లైవ్ కార్యక్రమం అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నగర ప్రజలు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు. అలాగే స్పందన కార్యక్రమంలో అర్జీలు అందించవచ్చన్నారు.

అంధకారంలో వీధులు

ప్రకాశం నగర్: రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక 4వ డివిజన్ రాజేంద్రనగర్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్‌లోని సచివాలయం వీధిలో కొన్ని చోట్ల విద్యుత్ బల్బులు పాడవడంతోపాటు పలు చోట్ల వెలగడంలేదు. దీంతో చీకటిలో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటితో పాటు కరెంట్ స్తంభాలకు వివిధ నెట్ కంపెనీల ఫైబర్ వైర్లు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేయడం వల్ల సంబంధిత నెట్ సంస్థలకు చెందిన బాక్స్‌లు కరెంట్ స్తంభాలకు అతికించారు. దీంతో తరచూ వీధి దీపాల వెలగకపోవడం వంటి సమస్యలు ఉత్పత్తనమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కారించాలని కోరుతున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు


కాలు తెగి పడిన వ్యక్తి

రాజమహేంద్రవరం సిటీ: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే అతనిని జీఆర్పీ పోలీసులు 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం 6.45 గంటల సమయంలో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫాంపై విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారి పడడంతో కుడికాలు తెగిపడింది. గాయపడిన వ్యక్తి అపస్మారకస్థితికి చేరుకోవడంతో అతని వద్ద ఏ ఆధారాలు లభించలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాధితుడు ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని జీఆర్పీ పోలీసులు తెలిపారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

కడియం: స్థానిక హైస్కూల్‌లో 1992–93 బ్యాచ్ విద్యార్థులు గతంలో మిత్రా ఫౌండేషన్ ద్వారా బడితోట కార్యక్రమం చేపట్టి, మొక్కలు నాటారు. ఆ కార్యక్రమంలో భాగంగా అప్పుడు నాటిన మొక్కల సంరక్షణకు ఆదివారం చర్యలు చేపట్టారు. స్కూల్‌లో నాటిన మొక్కల చుట్టూ శుభ్రం చేసి, పళ్లాలు కట్టారు. వాటికి ఎరువులు వేసి, నీరు పోశారు. కార్యక్రమంలో మలకల దొరబాబు, బడిగంటి హరిబాబు, ఏలూరు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కడియం: రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదివారం పలువురిని పరామర్శించారు. మాతృవియోగం పొందిన సీనియర్ జర్నలిస్టు బెజవాడ శంకర్రావును వీరవరంలో పరామర్శించారు. టీడీపీ నాయకులు ఈద్పుగంటి వీరవెంకటసత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. వేమగిరిలోని వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

టీడీపీ కరపత్రాల పంపిణీ

కడియం: మురమండ గ్రామంలో టీడీపీ కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదివారం చేపట్టారు. ఆ పార్టీ నాయకులు ప్రత్తిపాటి రామారావు చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విమర్శలు గుప్పించారు. పార్టీ నాయకులు మజ్జి పద్మావతి, పిల్లి తనూజ, ముత్తాబత్తుల విజయ కుమారి, అన్నందేవుల చంటి, చెల్బుయిన శ్రీనివాస్, రఘురామ్ పాల్గొన్నారు.

శెట్టిబలిజలు రాజ్యాధికారం దిశగా పయనించాలి


విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: శెట్టిబలిజలు రాజ్యాధికార దిశగా పయనించి చట్టసభలో మరిన్ని పదవులు పొందాలని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో రాజవోలు గ్రామంలోని ఎస్ఎస్ వెన్యూలో నిర్వహించిన శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అధ్యక్షతన జరిగిన సభలో కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గీయుల్లో అత్యధికులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. మనపెద్దలు దొమ్మేటి వెంకటరెడ్డి లాంటి ఎంతోమంది పేదల చదువుల కోసం బంగారుబాటలు వేశారన్నారు. శెట్టిబలిజ వర్గీయులు రాజ్యసభ సభ్యులుగాను, మంత్రులుగాను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా ఉన్నారని ఇంకా మరికొంత మంది రాజకీయాల్లో రాణించి పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఏడాదికి రెండుసార్లు శెట్టిబలిజ వివాహ పరిచయవేదిక నిర్వహిస్తున్న సానబోయిన రామారావును ఆయన అభినందించారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న వారికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు శెట్టిబలిజ సంక్షేమ సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సుధాకర్ చేతుల మీదుగా స్కాలర్ షిప్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, గూడూరి శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి తాతబ్బాయి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.వివేకానందమూర్తి, న్యాయవాది కుడుపూడి శ్రీనాథ్, కట్టా మల్లేశ్వరరావు, గుత్తుల మధుసూదనరావు, వెంకటేశ్వరరావు, గురుప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా సంఘం నాయకుడు కె.శ్రీనివాస్, కడలి కెరటాలు, పెంకే గంగాధరరావు, మట్టపర్తి గోవింద్, కౌన్సిలర్ సంసాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు


బ్లేడ్ బ్యాచ్ దోపిడీకి గురైన నాగదుర్గ

రాజానగరం: లాలాచెరువు నుంచి దివాన్‌చెరువు వరకూ బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఫారెస్టు అకాడమీ, మహాపుష్కర వనం, గామన్ బ్రిడ్జి రోడ్డు, ఆటోనగర్‌ల వద్ద రహదారిపై రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లే వారిని టార్గెట్ చేసి, బ్లేడ్‌లతో బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆటోనగర్‌లో ఉదయం 9 గంటల ప్రాంతంలో కొత్త హైవే నుంచి ఏడో రోడ్డుకు వస్తున్న గ్యాస్ వెల్డర్ యూనియన్ సభ్యుడు జి.నాగదుర్గని బ్లేడ్ బ్యాచ్ అకస్మాత్తుగా దాడి చేసి గొంతుపై గాయం చేసింది. అతని వద్ద ఉన్న రూ.1500 దోచుకుని పారిపోయింది. అలాగే ఈనెల 23న ఆటోనగర్‌కి వెళ్లే దారిలో మరో యువకుడిపై దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.18 వేలు లాక్కుని పరారయ్యారు. ఈ సంఘటనలపై యూనియన్ పరంగా బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణాలు చేసేవారు ప్రధాన రోడ్ల మీదుగానే ప్రయాణించాలని, అడ్డరోడ్లపై ప్రయణించడం అంత సురక్షితం కాదని అంటున్నారు. అనుమానాస్పదంగా సంచరించేవారు ఎవరైనా తారసపడితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరుతున్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు


కాటవరం వద్ద రాజమండ్రి-సీతానగరం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాజమహేంద్రవరం–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. దగ్గరుండి పనుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య, నిరంకుశ పాలనకు నిదర్శనమే ఈ సీతానగరం రోడ్డని, ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రధాన రహదారి విస్తరణ నిర్మాణ పనుల ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రహదారి విస్తరణ పనులకు మార్గం సుగమం చేశారన్నారు. మండల ప్రజల ఆకాంక్ష మేరకు శాశ్వత పద్ధతిలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. 18.2 కిలోమీటర్లు పొడవు గల కాతేరు–సీతానగరం రోడ్డును రూ.70 కోట్లతో చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీ తాడిపల్లి వెంకటరావు, పార్టీ నాయకులు చల్లమళ్ళ సుజీరాజు, పిచ్చుకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


టెన్నిస్ ఆడుతున్న చిన్నారులు


ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న యువత

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌లో చిన్నారులు, యువత, పెద్దలు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ నిర్వహించే హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమంలో పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో నగర ప్రజలు పాల్గొని ఆనందంగా గడిపారు. జేఎన్‌రోడ్ లోని ఏకేసీ కాలేజ్ వద్ద ఉన్న పరమహంస యోగానంద మార్గ్‌లో హ్యాపీ స్ట్రీట్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఆదివారం పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత, చిన్నారులు డ్యాన్స్‌లు, టెన్నిస్, క్యారమ్స్, చదరంగం, టెన్ని కాయిస్ ఇలా పలు రకాల ఆటలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు నగర వ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారు. ప్రజలకు ఆదివారం ఆటవిడుపుగా ఉండేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు.

దేవాలయాల్లో నృత్యోత్సవం

17వ రోజు అయోధ్యలో నృత్య ప్రదర్శనలు


అయోధ్యలో నృత్యం చేస్తున్న కళాకారిణులు

సీటీఆర్ఐ: ఎల్లలు దాటిన నాట్య యజ్ఞం. రాజమహేంద్రవరంలో ఆగస్టు 11వ తేదీన ప్రారంభమైన సంపూర్ణ భారతదేశ యాత్ర ఆదివారం ఆయోధ్యకి చేరుకుంది. కూచిపూడి నాట్యానికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీబీ నారాయణ మహోన్నత లక్ష్యంతో సాగిస్తున్న నృత్య యజ్ఞం 17వ రోజుకి చేరుకుంది. గత 17 రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్యబృందం నర్తిస్తోంది. శ్రీ రాధాకృష్ణ సంగీత నృత్య కళాక్షేత్ర ఆధ్వర్యంలో దేశం గర్వించదగ్గ రీతిలో సాగుతున్న సంపూర్ణ భారతదేశ యాత్రలో భాగంగా ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామ్ మందిర్‌లో నృత్య నిరాజనం చేశారు. కళాకారిణులు తమ నృత్యంతో చూపరులను మంత్రముగ్ధులను చేశారు. శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన కళావైభవం అత్యంత విశిష్టమైందన్నారు. కూచిపూడి నృత్యానికి పూర్వవైభవం తీసుకురావడం, నేటి యువతకు మన ప్రాచీన సంప్రదాయాలను గుర్తు చేయాలని 66 రోజులపాటు నిర్విరామంగా దేశంలోని అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఈ నృత్య నిరాజనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జి.లక్ష్మీదీపిక, నృత్య బృందం పాల్గొన్నారు.

ఎన్నికల్లో మన సత్తా చాటుదాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం


నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే మనకు శ్రీరామరక్ష అని, వచ్చే ఎన్నికలలో మన సత్తా చాటి ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతు చేద్దామని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. స్థానిక జీవీకే కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ పని చేస్తున్న ప్రభుత్వానికి మరింత అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం వంద శాతం పథకాలను అమలు చేసి ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. ప్రతి పథకం నేరుగా ప్రజల ఖాతాలకు వేస్తూ సీఎం జగన్ అవినీతికి స్వస్తి పలికారన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందేలా వలంటీర్, సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. గత ఎన్నికలలో చంద్రబాబు 650 పైగా వాగ్దానాలు ఇచ్చి అందులో 10శాతం హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలు నిలదీస్తారని మెనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనం టీడీపీదేనని ఎద్దేవ చేశారు, రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు త్వరలోనే పూర్తి చేస్తామని, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆధునీకరణ పనులు, రఘుదేవపురంలో సీహెచ్‌సీ నిర్మాణానికి త్వరలో శంఖుస్థాపన, చినకొండేపూడిలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కష్టపడిని కార్యకర్తలకు పార్టీలో సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాబోరు కురుక్షేత్ర యుద్ధంలో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న వైస్ ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్ గద్దె వెంకటకృష్ణ చౌదరి, కొండపల్లి దుర్గారావు, సర్పంచ్‌లు కోండ్రపు ముత్యాలు, మెల్లిమి రామచంద్రరావు, సత్యం రాంపండు, మద్దాల కొండలరావు, కవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై అధికారుల దాడులు


దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా, వస్తువులతో సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ నేతృత్వంలో జిల్లా టాస్క్‌ఫోర్స్, టెక్నికల్ టీమ్, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్, స్టాఫ్ ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రాజానగరం మండలం నామవరంలో ఇద్దరిని అరెస్టు చేసి, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. అలాగే రెండు మోటారుసైకిళ్లు, ఒక గ్యాస్‌సిలిండర్, ఒక గ్యాస్ బర్నర్, రెండు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. నామవరానికి చెందిన అంకే శ్రీనివాస్, శాటిలైట్‌సిటీకి చెందిన నేదులూరి రాంబాబులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌చార్జి సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

కంబాలచెరువు: ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత కట్టుదిట్టం చేసి నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా కట్టడి చేస్తున్నామని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. భద్రత మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు, ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేసి, పాత నేరస్తులు పై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో 65 కేసులు నమోదు చేసి, వెహికల్స్ సీజ్ చేశామని, వాటిని కోర్టులో హాజరు పరచనున్నామన్నారు.

గాయకుడు ముఖేష్‌కు ఘన నివాళి


ముఖేష్‌కు నివాళులర్పిస్తున్న మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ హిందీ గాయకులు ముఖేష్‌జీ వర్ధంతి సభను స్థానిక జిత్ మోహన్ కళావేదికలో జరిగింది. నట గాయకులు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా, ముఖ్య అతిథులుగా పీవీఎస్ కృష్ణారావు, దేశినీడి బలరాం నాయుడు, బి.సీతారామారావు పాల్గొన్నారు. మిత్ర మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గాయకుల్లో ముఖేష్ ఒకరని, ఎన్నో విజయవంతమైన చిత్రాలకు తన మధుర గాత్రం అందించి, చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేసుకున్నారు. గాయకులు జిత్ మోహన్ మిత్ర, డాక్టర్ వంక బాలకృష్ణ, డీవీవీఎస్ నారాయణ ముఖేష్ పాడిన పలు పాటలను పాడి స్వర నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల మరిడియ్య, సంక్రాంతి రత్నకుమార్, దేవికారాణి దంపతులు, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, వి.జగపతి, మార్కండేయులు, రామ్మోహన్ రావు, అతిక్, నాగేంద్ర, రాయుడు గంగయ్య, సుక్కిరెడ్డి శ్రీనివాస్, సుక్కిరెడ్డి సోమరాజు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీట్ హోల్డర్స్, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనికి సుమారు 120 మంది పాత నేరస్తులు హాజరైనట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి కేసుల్లో తమ ప్రమేయం ఉంటే సహించేది లేదన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. దీని దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్లు, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. గంజాయి వివిధ మానసిక, శారీరక ప్రభావాలను కలిగి ఉంటుందన్నారు. దీన్ని తాగడం వల్ల మానసిక స్థితి, సమయ భావం, ఏకాగ్రత, స్వల్పకాలిక జ్ఞాపకశక్తి బలహీనపడుతుందన్నారు.

ఐఓసీఎల్‌లో మాక్ డ్రిల్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున ఉన్న ఐఓసీఎల్ టెర్మినల్‌లో శనివారం లెవల్–3 మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఐఓసీఎల్ పైపులైన్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే తీసుకునే నివారణ చర్యలను కళ్లకు కట్టినట్టు మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. ఐఓసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి టి.సాయికిషోర్ మాట్లాడుతూ మాక్‌డ్రిల్ ఆవశ్యకతను వివరించారు.

సినిమాలు



శ్యామల: బెదురులంక 2012
సూర్యమినీ: డ్రీమ్‌గర్ల్–2
సూర్యప్యాలెస్: గాండీవధారిఅర్జున
స్వామి: భోళాశంకర్
శివజ్యోతి: బెదురులంక 2012
అనుశ్రీ: కింగ్‌ఆఫ్‌కొత్త
రాజా: గాండీవధారిఅర్జున
అశోక: జైలర్
ఊర్వశి: గాండీవధారి అర్జున
రంభ: బేబి
మేనక: ఏం చేస్తున్నావని, భూతాలభంగళా
అప్సర: బాయ్స్‌హాస్టల్

నామవరం
వీఎస్ మహల్: గాండీవధారి అర్జున

ధవళేశ్వరం
మురళీకృష్ణ: గాండీవధారి అర్జున

కడియం
వెంకటసూర్య: గాండీవధారి అర్జున